సాక్షి
యాదాద్రి భువనగిరి


బుధవారం । 3 । ఏప్రిల్ । 2024



తెలంగాణలో అనుమతించబోం
కేంద్రం తీసుకొచ్చిన సీఏఏ, ఎన్ఆర్సీలను రాష్ట్రంలో అనుమతించబోమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. - 8లో



త్వరలో బుద్ధవనం పనులు పూర్తి
బుద్ధవనం అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ రమేశ్‌నాయుడు అన్నారు. - 10లో



న్యూస్‌రీల్

క్షేత్రపాలకుడికి ఆకుపూజ



ఆంజనేయస్వామికి ఆకుపూజ నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో మంగళవారం శ్రీఆంజనేయస్వామికి అర్చకులు ఆకుపూజను విశేషంగా నిర్వహించారు. ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో అర్చించారు. హనుమంతుడికి ఇష్టమైన నైవేద్యం సమర్పించి, భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ఇక ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా కొనసాగించారు. శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం జరిపించి, సాయంత్రం వెండి జోడు సేవ పూజలు నిర్వహించారు.

సీపీఎంను ఆదరించాలి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

చౌటుప్పల్: నిరంతరం ప్రజల కోసం పోరాటాలు చేసే సీపీఎంను ఆదరించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సీపీఎం మునుగోడు నియోజకవర్గ సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి సరైన గుణపాఠం చెప్పాలన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి ఎండీ.జహంగీర్‌కు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. జహంగీర్ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారమే తన దినచర్యగా ఉంటుందని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు జగదీష్, నల్లగొండ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు దోనూరి నర్సిరెడ్డి, బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, కట్ట నర్సింహ, బట్టుపల్లి అనురాధ, ఆనగంటి వెంకటేష్, గంగదేవి సైదులు, బండారు నర్సింహ, ఏర్పుల యాదయ్య, మిర్యాల భరత్, మొదుగాల వెంకన్న పాల్గొన్నారు.

8 నుంచి ఎస్‌ఏ-2 పరీక్షలు

భువనగిరి: అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో ఈ నెల 8 నుంచి 20వ తేదీ వరకు 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఎస్‌ఏ- 2 పరీక్షలు కొనసాగనున్నాయి. ఈమేరకు ఈనెల 1 నుంచి పాఠశాల విద్యాశాఖ ప్రణాళిక విడుదల చేసింది. జిల్లాలో 163 జెడ్పీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 68 ప్రాథమికోన్నత, 481 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 1 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులు సుమారు 40,154 మంది ఉన్నారు. అయితే పరీక్షలు 20వ తేదీన ముగియనుండగా 21 వరకు మూల్యాంకనం పూర్తి చేసి ఫలితాలను క్యుములేటివ్ రికార్డులో నమోదు చేయాలి. 23న పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి విద్యార్థుల పురోగతి క్యుములేటివ్ రికార్డులు అందించి వాటిపై వారి సంతకం చేయించి ఉపాధ్యాయులకు అప్పగించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

ప్రత్యేక టెట్ నిర్వహించాలి



జ్ఞానేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి, ఉపాధ్యాయులు

భూదాన్‌పోచంపల్లి: ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి అన్నారు. మంగళవారం భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు సూరం జ్ఞానేశ్వర్‌రెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల ప్రమోషన్‌కు టెట్ తప్పనిసరిగా భావిస్తే ప్రత్యేకంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల తరువాత బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజారెడ్డి, బాలల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మిర్యాల దామోదర్, ప్రధాన కార్యదర్శి మెతుకు సైదులు, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సైదులు, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్, అంజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భువనగిరి.. గెలుపుపై గురి

ప్రచారంలోకి దిగిన నాలుగు ప్రధాన పార్టీలు

- మూడోసారి గెలుపొందాలని కాంగ్రెస్ తహతహ
- మరో విజయాన్ని నమోదు చేయాలని బీఆర్ఎస్ వ్యూహం
- తొలిసారి గెలిచి పాగా వేయాలని బీజేపీ ప్రయత్నం
- సత్తా చాటేందుకు బరిలోకి దిగిన సీపీఎం



చామల కిరణ్ కుమార్‌రెడ్డి



ఎండీ జహంగీర్



డాక్టర్ బూర నర్సయ్యగౌడ్



క్యామ మల్లేష్

సాక్షి, యాదాద్రి : పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా ప్రధాన పార్టీలు పోరుకు సిద్ధమయ్యాయి. 2009లో నూతనంగా ఏర్పడిన భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో రెండు సార్లు విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ మరో విజయంపై గురిపెట్టింది. బీఆర్ఎస్ పార్టీ రెండో విజయం కోసం పోటీపడుతోంది. ప్రధాని మోదీ చరిష్మాను నమ్ముకున్న బీజేపీ తన ప్రచారాన్ని ముమ్మరం చేసింది. సీపీఎం సైతం అభ్యర్థిని రంగంలోకి దించింది. కాంగ్రెస్ పార్టీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని, బీజేపీ డాక్టర్ బూరనర్సయ్యగౌడ్‌ను, బీఆర్ఎస్ పార్టీ క్యామ మల్లేష్‌ను, సీపీఎం ఎండీ జహంగీర్‌లను తమ అభ్యర్థులుగా ప్రకటించాయి. ఆయా పార్టీలు ఎన్నికల ఇన్‌చార్జులను కూడా నియమించాయి. కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్‌గా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, సీపీఎం నుంచి ఇన్‌చార్జిగా చెరుపల్లి సీతారాములు, బీజేపీ నుంచి వి.పాపారావు (ప్రభారి) ఎన్నికల ఇంచార్జ్‌గా, పొలిటికల్ ఇంచార్జ్‌గా ఎన్ఎస్ఎస్ ప్రభాకర్, క్లస్టర్ ఇంచార్జ్‌గా కాసం వెంకటేశ్వర్లును నియమించగా, బీఆర్ఎస్ పార్టీ నుంచి ఇంచార్జ్‌ను ఇంకా నియమించలేదు. బీజేపీ, సీపీఎం అభ్యర్థులు నియోజకవర్గంలో పార్టీ నాయకులతోపాటు వివిధ వర్గాల ప్రజలను కలుస్తున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు మాత్రం ఆయా పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులను ప్రసన్నం చేసుకుంటున్నారు. క్యాడర్‌ను సమాయత్తం చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించారు.

మూడో విజయం కోసం..

కాంగ్రెస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో మరోసారి గెలుపు కోసం సిద్ధమైంది. కోమటిరెడ్డి సోదరులు 2009, 2019లో రెండుసార్లు కాంగ్రెస్ పార్టీ నుంచి విజయం సాధించారు. ప్రస్తుతం భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని జనగామ అసెంబ్లీ సెగ్మెంట్ మినహా ఆరు చోట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అనుచరునిగా చామల కిరణ్‌కుమార్ రెడ్డి తొలిసారి భువనగిరి బరిలో ఉన్నారు. ఈయనకు కోమటిరెడ్డి సోదరుల ప్రభావం కలిసి వస్తుందని భావిస్తున్నారు.

పాగా వేసేందుకు..

భువనగిరి బీజేపీ అభ్యర్థి డాక్టర్ బూరనర్సయ్యగౌడ్ రెండోసారి విజయం కోసం పోరాడుతున్నారు. 2014లో బీఆర్ఎస్(టీఆర్ఎస్) నుంచి ఆయన విజయం సాధించారు. 2019లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరిన ఆయన ప్రస్తుత ఎన్నికలో విజయంపై ధీమాతో ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం, మోదీ ప్రభావంతో గెలుపొందాలని భావిస్తున్నారు. తాను ఎంపీగా చేసిన అభివృద్ధి పనులను ప్రచారంలో వాడుకుంటున్నారు.

కార్మికవర్గం ఓట్లను నమ్ముకున్న సీపీఎం

సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్ ప్రచారం ముమ్మరం చేశారు. కార్మికవర్గం పక్షాన నిలబడి పోరాటాలు నిర్వహించిన సీపీఎం.. వారి ఓట్లను నమ్ముకుంది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అభ్యర్థి తరపున ప్రచారం చేస్తున్నారు.

రెండో విజయంపై కన్నేసిన బీఆర్ఎస్

భువనగిరిలో రెండో విజయం కోసం బీఆర్ఎస్ కన్నేసింది. 2014లో గెలిచిన బీఆర్ఎస్, 2019లో మాత్రం స్వల్ప ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ చేతిలో ఓడిపోయింది. బూరనర్సయ్యగౌడ్ పార్టీని వీడడంతో నూతన అభ్యర్థిగా క్యామ మల్లేష్‌ను బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలిచినప్పటికీ 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థి ఓడిపోయారు. ఇప్పుడు ఒక జనగామలో మాత్రమే బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఉన్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో బీఆర్ఎస్ ఇంకా బలంగానే ఉంది. అధినేత కేసీఆర్ రెండు రోజుల క్రితం రైతుల పరామర్శ పేరుతో నియోజకవర్గంలో పర్యటించారు. బుధవారం పార్లమెంట్ స్థాయి సన్నాహక సమావేశం భువనగిరిలో ఏర్పాటు చేశారు.

నేడు పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం

భువనగిరి: బీఆర్ఎస్ భువనగిరి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ, మండల కమిటీ అధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సాయి కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 11 గంటల నిర్వహించే సమావేశానికి ముఖ్య అతిథిలుగా మాజీ మంత్రులు హరీశ్‌రావు, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

విధులు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ హనుమంతు కే. జెండగే



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే. జెండగే

భువనగిరిటౌన్: పోలింగ్ విధులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే అధికారులకు సూచించారు. మంగళవారం భువనగిరి పట్టణంలోని వెన్నెల కళాశాలలో భువనగిరి, ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు పోలింగ్ విధానం, ఈవీఎం యంత్రాల పనితీరుపై నిర్వహించిన రెండవ రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలకు సంబంధించిన పూర్తి మెటీరియల్ అందించడం జరిగిందని, పోలింగ్ రోజు నిర్వహించే విధులు, ఈవీఎం యంత్రాలపై పూర్తి అవగాహన పొందాలని, ఎలాంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేసుకోవాలని తెలిపారు. బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లను పోలింగ్ కేంద్రాల్లో అమర్చడం, మాక్ పోలింగ్‌పై అవగాహన ఉండాలన్నారు. ప్రిసైడింగ్ అధికారుల హ్యాండ్‌బుక్‌లోని ప్రతి అంశాన్ని తెలుసుకొని ఉండాలన్నారు. మొత్తం పోలింగ్ సామగ్రిని పొందాలన్నారు. నిబంధనల ప్రకారం మాక్ పోల్ నిర్వహించాలని, నిర్ణీత సమయానికి పోలింగ్ ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. బ్యాలెట్ గోప్యతను కాపాడే విధంగా ఓటింగ్ కంపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పోలింగ్ పూర్తయిన తర్వాత కంట్రోల్ యూనిట్‌లో క్లోజ్ బటన్ పోలింగ్ ఏజెంట్ల ముందు చేసి డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ప్రిసైడింగ్ ఆఫీసర్ హ్యాండ్ బుక్‌లోని సూచనల ప్రకారం అన్ని పత్రాలను సీల్ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి అమరేందర్, కలెక్టరేట్ ఏఓ జగన్మోహన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా ఓటు వేయాలి

భువనగిరి: ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు వేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. స్వీప్ ఓటరు అవగాహన ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం భువనగిరి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల నుంచి పాత బస్టాండ్ సమీపంలోని మండల పరిషత్ కార్యాలయం వరకు 5కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జెండా ఊపి 5కే రన్ ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో గత అసెంబ్లీలో ఎన్నికల్లో 90 శాతం పోలింగ్ నమోదు జరిగిందని, అదే మాదిరిగా పార్లమెంట్ ఎన్నికల్లో కూడా పోలింగ్ శాతం పెరిగేలా సహకరించాలని కోరారు. అనంతరం ఓటింగ్‌లో పాల్గొంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, స్వీప్ నోడల్ అధికారి కృష్ణన్, జెడ్పీ సీఈఓ శోభారాణి, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



జెండా ఊపి 5కే రన్ ప్రారంభిస్తున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న సీపీ తరుణ్ జోషి, సమావేశంలో పాల్గొన్న డీసీపీ రాజేశ్ చంద్ర, పోలీస్ అధికారులు

- రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి

సాక్షి, యాదాద్రి: నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి అన్నారు. మంగళవారం యాదాద్రి జోన్ డీసీపీ, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఎస్‌హెచ్‌ఓలు, ఇతర అధికారులతో భువనగిరిలో క్రైమ్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా యాదాద్రి జోన్‌లోని వివిధ స్టేషన్లలో నమోదైన పోక్సో కేసులు, ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ, పెండింగ్, ఇతర కేసుల విచారణ, పురోగతిపై సమీక్షించారు. కొన్ని కేసులు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఎందుకు ఉంటున్నాయని ఆయా స్టేషన్ల పోలీస్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీ మాట్లాడుతూ యాదాద్రి జోన్ పరిధిలో జరిగే నేరాలను అదుపులో ఉంచడానికి నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. నేర నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చే బాధితులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, వారి బాధలను ఓపికగా విని తగిన న్యాయం చేయాలని సూచించారు.

ఎన్నికల విధులపై అప్రమత్తంగా ఉండాలి

రానున్న లోక్‌సభ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడానికి ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీపీ తరుణ్ జోషి అన్నారు. యాదాద్రి జోన్ పరిధిలో ఎనిమిది స్టాటిక్ సర్వేలైన్స్ టీమ్స్ ఏర్పాటు చేశామన్నారు. అక్రమంగా తరలిస్తున్న డబ్బు, మద్యం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే ఇతర నిషేధిత వస్తువులను పట్టుకోవడానికి అవసరమైన చోట్ల మరిన్ని చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు సంబంధిత పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణలో క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు, వల్నరబుల్ పోలింగ్ ప్రాంతాల గుర్తింపుపై స్పష్టతతో ఉండాలని సూచించారు. ఆయా స్టేషన్ల సిబ్బంది పనితీరు గురించి తెలుసుకున్నారు. సమావేశంలో యాదాద్రి భువనగిరి డీసీపీ రాజేశ్ చంద్ర ఉన్నారు.

కాకతీయుల శిల్పాలను కాపాడుకోవాలి

చింతపల్లి : కాకతీయుల కాలం నాటి శిల్పాలను కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకులు శివనాగిరెడ్డి అన్నారు. మంగళవారం చింతపల్లి మండలంలోని గొడుకొండ్ల గ్రామంలో 800 సంవత్సరాల నాటి కాకతీయుల శిల్పాలను ఆయన పరిశీలించారు. మాల్ వెంకటేశ్వరనగర్, గొడుకొండ్ల శివారులోని వేణుగోపాలస్వామి దేవాలయ ప్రాంగణంలో సప్తమాతృకల శిలాఫలకం రెండు ముక్కలై ఉండగా ఒకటి గోడకు, మరొకటి మండప ద్వారానికి ఎడమవైపు బిగించి ఉన్నాయని తెలిపారు. వాటిపై నలుపు రంగు పూసి ఉండడంతో రంగును తొలగించాలని ఆలయ కమిటీకి సూచించారు.

కోరం లేక స్థాయీ సంఘం సమావేశం వాయిదా



స్థాయీ సంఘం సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరుకాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

భువనగిరిటౌన్: జెడ్పీ కార్యాలయంలో మంగళవారం జరగాల్సిన జెడ్పీ స్థాయీ సంఘం సమావేశం ప్రజాప్రతినిధులు రాకపోవడంతో వాయిదా పడింది. ఉదయం ఒకటో స్థాయీ సంఘం (ఆర్థిక), ఏడో స్థాయీ సంఘం (పనులు), మధ్యాహ్నం 12 గంటలకు గ్రామీణాభివృద్ధి, మధ్యాహ్నం నాలుగో స్థాయీ సంఘం (విద్య, వైద్యం) సమావేశాలు జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించాల్సి ఉంది. ఆయా స్థాయీ సంఘాల సమావేశాలకు చైర్మన్‌తో పాటు, సభ్యులు గైర్హాజరయ్యారు. దీంతో సమావేశం నిర్వహణకు కోరం లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు జెడ్పీ సీఈఓ శోభారాణి తెలిపారు. అయితే బుధవారం 5వ, 3వ, 6వ స్థాయీ సంఘం సమావేశం నిర్వహించనున్నారు.

వైద్యకళాశాల ఏర్పాటు ప్రక్రియ వేగవంతం

- తరగతుల నిర్వహణకు తాత్కాలిక భవనం
- శాశ్వత భవన నిర్మాణానికి మల్లాపురం వద్ద స్థలం పరిశీలన
- జిల్లా కేంద్ర ఆస్పత్రి భవనంపైనే 220 బెడ్స్ ఏర్పాటుకు మరో అంతస్తు నిర్మాణం



జిల్లా కేంద్ర ఆస్పత్రిని పరిశీలిస్తున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, ఇంజనీర్ల బృందం

భువనగిరి: జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటు ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించనున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా కసరత్తు మొదలుపెట్టారు. ప్రారంభంలో వైద్య కళాశాలకు 50 ఎంబీబీఎస్ సీట్లు కేటాయించింది. ఇప్పటికే కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ మల్లికార్జున్‌ను నియమించింది. జిల్లా కేంద్ర ఆస్పత్రితో పాటు తాత్కాలికంగా తరగతుల నిర్వహణకు పాత కలెక్టరేట్ భవనం, శాశ్వత భవన నిర్మాణానికి వైటీడీఏ పరిధిలోని మల్లాపురం వద్ద కేటాయించిన స్థలాన్ని మంగళవారం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో చీఫ్ ఇంజనీర్ దేవేంద్ర, ఈఈ అజీజ్, డీఈతో పాటు డీసీహెచ్ఎస్ డాక్టర్ చిన్నానాయక్‌లు పరిశీలించారు.

తరగతుల నిర్వహణకు పాత కలెక్టరేట్ భవనం

గత ప్రభుత్వం 2023 జూలై 6న జిల్లాకు మంజూరు చేసిన మెడికల్ కళాశాల ఏర్పాటు కోసం యాదగిరిగుట్ట సమీపంలోని మల్లాపురం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 65లో 20 ఎకరాలు కేటాయించింది. మెడికల్ కళాశాల భవన నిర్మాణాలు, ఇతర అవసరాల కోసం గతంలోనే రూ.182 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. తొలుత 50 ఎంబీబీఎస్ సీట్లతో కళాశాలను నిర్వహించనున్నారు. ప్రస్తుతానికి మల్లాపురంలో భవన నిర్మాణం ఈ విద్యా సంవత్సరానికి అందుబాటులోకి వచ్చే పరిస్థితి లేకపోవడంతో తాత్కాలికంగా వైద్య బోధన తరగతుల కోసం భువనగిరి పట్టణ శివారులోని పాత కలెక్టరేట్ భవనం ఎంపిక చేశారు. మెడికల్ కళాశాలకు అనుబంధంగా జిల్లా కేంద్ర ఆస్పత్రిని కేటాయించారు.

డీఎంఈ పరిధిలోకి జిల్లా ఆస్పత్రి..

ఇప్పటి వరకు తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) పరిధిలో ఉన్న జిల్లా కేంద్ర ఆస్పత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలోకి వెళ్లిన విషయం తెలిసిందే. జిల్లా కేంద్ర ఆస్పత్రి డీఎంఈ పరిధిలోకి వెళ్లడంవల్ల అందులో పనిచేస్తున్న 28 మంది నర్సులను ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు టీవీవీపీ పరిధిలోని ఆస్పత్రులకు బదిలీ చేశారు.

జిల్లా కేంద్ర ఆస్పత్రి భవనంపై మరో అంతస్తు నిర్మాణం

మెడికల్ కళాశాలకు సంబంధించి మొత్తం 13 రకాల డిపార్ట్‌మెంట్‌లు ఉంటాయి. దీంతో ఒక్కో డిపార్ట్‌మెంట్‌కు 20 బెడ్స్ చొప్పున కేటాయించాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రస్తుతం ఉన్న జిల్లా కేంద్ర ఆస్పత్రి భవనంపై సుమారు 220 బెడ్స్ ఏర్పాటుకు భవనం నిర్మించనున్నారు. మెడికల్ కళాశాల నిర్వహణకు అవసరమైన 212 మంది బోధన, బోధనేతర సిబ్బందిని నియమించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కళాశాలకు చెందిన గర్ల్స్ హాస్టల్‌ను పాత కలెక్టరేట్‌లోనే కేటాయించగా బాయ్స్ కోసం మరో చోట భవనాలను పరిశీలిస్తున్నారు. ఈమేరకు సెంట్రల్ డ్రగ్స్ స్టోర్ కోసం పట్టణంలోని రైతు బజార్ వద్ద ఎకరం స్థలంలో నిర్మించేందుకు స్థలాన్ని పరిశీలించారు.

నేటి నుంచి టెన్త్ మూల్యాంకనం

- భువనగిరిలోని దివ్యబాల విద్యాలయంలో ఏర్పాట్లు
- జిల్లాకు 1,48,000 సమాధాన పత్రాలు



భువనగిరి పట్టణ శివారులోని దివ్యబాల విద్యాలయం

భువనగిరి : పదో తరగతి పరీక్ష పేపర్ల మూల్యాంకనం బుధవారం నుంచి ప్రారంభం కానుంది. భువనగిరి శివారులోని దివ్యబాల విద్యాలయంలో మూల్యాంకనం జరగనుంది. జిల్లాకు మొత్తం 1,48,000 సమాధాన పత్రాలు కేటాయించగా ఇప్పటికే వచ్చిన వాటికి కోడింగ్ వేస్తున్నారు. ఈ నెల 11వ తేదీ వరకు మూల్యాంకనం కొనసాగనుంది.

800 మంది సిబ్బంది నియామకం

మూల్యాంకనం చేసే ప్రక్రియకు క్యాంప్ ఆఫీసర్‌గా డీఈఓ నారాయణరెడ్డి, డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్‌గా ఏసీఈ కృష్ణారెడ్డి, పాండునాయక్ వ్యవహరించనున్నారు. వీరితో పాటు అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లుగా ఏడుగురు, సీఈలుగా 100 మందిని నియమించారు. సమాధాన పత్రాలను మూల్యాంకనం చేసేందుకు సుమారు 600 మందిని నియమించారు. ఇప్పటికే మూల్యాంకనం చేసే ఏఈ (ఎగ్జామినర్లు)లకు ఆర్డర్లను జారీ చేయడం ప్రారంభించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు క్యాంప్ కొనసాగనుంది. అయితే సెల్‌ఫోన్లు, ఇతరులను క్యాంప్‌లోకి అనుమతించరు. ప్రతి ఎగ్జామినర్‌కు రోజుకు 40 సమాధాన పత్రాల చొప్పున ఇవ్వనున్నారు.

9 రోజుల పాటు క్యాంప్

పదో తరగతికి సంబంధించిన వార్షిక సమాధాన పత్రాల మూల్యాంకనం బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఇందుకోసం భువనగిరిలోని దివ్యబాల విద్యాలయంలో ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రస్తుతం పేపర్ల కోడింగ్ ప్రక్రియ జరుగుతోంది. సుమారు 9 రోజుల పాటు క్యాంప్ కొనసాగుతుంది. ఏఈలకు ఆర్డర్లను జారీ చేస్తున్నాం. నిర్ణీత సమయంలో క్యాంప్‌కు రావాలి.

– నారాయణరెడ్డి, డీఈఓ

రోడ్లు నిర్మానుష్యం

యాదగిరిగుట్ట: భానుడు రోజురోజుకు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. దీంతో ప్రజలు రోడ్లపైకి రావడానికి జంకుతున్నారు. మంగళవారం యాదగిరిగుట్టలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో పట్టణ ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఉదయం 9గంటల వరకే ప్రజలు రోడ్లపై కనిపిస్తున్నారు. ఆ తరువాత ఇంటికే పరిమితమై, సాయంత్రం 5.30గంటల తరువాత రోడ్లపైకి వస్తున్నారు. ఇక వేసవి తాపంతో యాదాద్రీశుడి ఆలయానికి సైతం భక్తుల రద్దీ తగ్గింది.



యాదగిరిగుట్ట పట్టణ రహదారిపై కనిపించని వాహనాల రద్దీ

దాసి సుదర్శన్‌కు కన్నీటి వీడ్కోలు

- తరలివచ్చిన కార్టూనిస్టులు, కళాకారులు
- నివాళులర్పించిన రాజకీయ పార్టీల నాయకులు, బంధుమిత్రులు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపురం కాలనీకి చెందిన ప్రముఖ చిత్రకారుడు, సాహితీవేత్త దాసి సుదర్శన్(72)కు మంగళవారం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కన్నీటి వీడ్కోలు పలికారు. సోమవారం గుండెపోటుతో మరణించిన ఆయన మృతదేహాన్ని బంధుమిత్రుల సందర్శనార్థం సీతారాంపురంలో స్వగృహంలో ఉంచారు. విషయం తెలుసుకున్న కార్టూనిస్టులు, కవులు, కళాకారులు, స్నేహితులు, బంధువులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తరలివచ్చి ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. సుదర్శన్‌తో ఉన్న జ్ఞాపకాలను నెమరువేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు అయిన సుదర్శన్ పలు సంఘాలతోపాటు శేషు, రమణచారీతో కలిసి పని చేశారని తెలిపారు. దాసి సినిమాకు జాతీయ స్థాయిలో రాష్ట్రపతి నుంచి ఉత్తమ కార్టూనిస్టు డిజైనర్‌గా అవార్డు లభించిందని పేర్కొన్నారు. ఒక వైపు చిత్రకారుడుగా మరో వైపు జర్నలిస్టుగా రాణించారని తెలిపారు. సుదర్శన్ అకాల మృతి తీరనిలోటన్నారు. అనంతరం సీతారాంపురం నుంచి తాళ్లగడ్డలోని హిందూ శ్మశాన వాటిక వరకు జరిగిన అంతిమ యాత్రలో బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చెరుకు సుధాకర్, తెలంగాణ మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు, వేణు సంకోజు, మానవ హక్కుల వేదిక నేత సుబ్బారావు, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, కిరణ్మాయి, సోమయ్య, అంబటి నాగయ్య, రాంమోహన్, యోగానందం, ఈసం రామయ్య, కస్తూరి ప్రభాకర్, నారాయణరెడ్డి, జ్వాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సుదర్శన్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డాక్టర్ చెరుకు సుధాకర్, కార్టూనిస్టు శంకర్ తదితరులు

కార్టూనిస్టులు, జర్నలిస్టుల సంతాపం

జర్నలిస్టు, ఉత్తమ కార్టూనిస్టు డిజైనర్‌గా రాష్ట్రపతి అవార్డు అందుకున్న సుదర్శన్‌కు సాక్షి దినపత్రిక కార్టూనిస్టు శంకర్‌తో పాటు విఘ్నేశ్వరాచారి (చిత్ర), నర్సింహ, వడ్డెపల్లి వెంకటేష్, విజయ్‌కుమార్ తదితరులు సుదర్శన్ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం సుదర్శన్ గదిలో ఉన్న ఆయన వేసిన పలు చిత్రాలను పరిశీలించారు. అదేవిధంగా మిర్యాలగూడ జర్నలిస్టులు కూడా సుదర్శన్ మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో జర్నలిస్టులు ఖాజాహమీదుద్దీన్, రంగా శ్రీనివాస్, కలిమెల నాగయ్య, ఖాజానా జీముద్దీన్, నామిరెడ్డి నరేందర్‌రెడ్డి, వెంకన్న, ఎస్‌కె అయ్యూబ్, జంగా లక్ష్మణ్‌యాదవ్, మనోజ్, రుద్రోజు కిశోర్, కాతోజు నాగాచారి, రాచకొండ రమేష్, మంద సైదులు, శ్రీను తదితరులున్నారు. అదే విధంగా దాసి సుదర్శన్ మృతికి మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మంగళవారం సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

సీఏఏ, ఎన్‌ఆర్‌సీలను అనుమతించబోం

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కోదాడ: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సీఏఏ(సిటిజన్ షిప్ అమెండ్‌మెంట్ యాక్ట్), ఎన్ఆర్‌సీ(నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్)లను తెలంగాణ రాష్ట్రంలో అనుమతించబోమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం రాత్రి సూర్యాపేట జిల్లా కోదాడలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ ఎంఏ జబ్బార్ ఇచ్చిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ లౌకిక వాదాన్ని సమర్థిస్తుందని, దేశంలో అన్నిమతాలను, కులాలను సమానంగా చూస్తుందన్నారు. దేశంలో లౌకికపాలన రావాలంటే దేశ ప్రజలంతా, ముఖ్యంగా ముస్లింలు రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడానికి సహకరించాలని కోరారు. కాంగ్రెస్‌పార్టీ, ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు అండగా ఉంటుందని, వారి అభివృద్ధికి నిరంతరం పాటుపడుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశ పెట్టి అమలు చేయనున్నట్లు తెలిపారు. కోదాడలో ముస్లిం కోసం రూ.3 కోట్లతో షాదీఖానా మంజూరు చేశామని, రూ.2 కోట్ల తో ఈద్గాను అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ముస్లిం కుటుంబాలకు అల్లా దయతో అంతా మంచి జరగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ ఎంఏ జబ్బార్, కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, వంగవేటి రామారావు, ఎర్నేనిబాబు, బషీర్, చింతలపాటి శ్రీనివాస్, పారా సీతయ్య, బుర్రాపుల్లారెడ్డి, రమేష్, మునావర్, ఫయాజ్ పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో భోజనం వడ్డిస్తున్న మంత్రి

పేరూరులో శివాలయం గోపురం ధ్వంసం

హాలియా : కాకతీయుల నాటి శివాలయం శిఖరంపై ఏర్పాటు చేసిన గోపురాన్ని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించి ధ్వంసం చేశారు. ఈ ఘటన అనుముల మండలంలోని పేరూరు గ్రామంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 700 ఏళ్ల క్రితం కాకతీయుల కాలంలో పేరూర్ గ్రామంలో స్వయంభూ సోమేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించారు. ఎస్‌డీఎఫ్ నిధులు రూ.40లక్షలతో ఈ ఆలయాన్ని పునర్నిర్మాణం చేపట్టారు. పునర్నిర్మాణంలో భాగంగా ఆలయం శిఖరంపై ఉన్న గోపురాన్ని తొలగించి సమీపంలో పెట్టారు. సోమవారం అర్ధరాత్రి దుండగులు ఆలయంలోకి చొరబడి గోపురాన్ని రహస్య ప్రదేశానికి తీసుకెళ్లి ధ్వంసం చేశారు. స్థానికులు గమనించి ఆలయ కమిటీ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మంగళవారం ఘటన స్థలాన్ని ఆలయ చైర్మన్ రిక్కల కొండారెడ్డి, ఎస్ఐ సతీష్‌రెడ్డి తదితరులు పరిశీలించారు. గుప్త నిధుల కోసమే దుండగులు గోపురాన్ని ధ్వంసం చేసి ఉంటారని అనుమానిస్తున్నారు.


ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ సతీష్‌రెడ్డి, ఆలయ చైర్మన్ కొండారెడ్డి

అప్పుల బాధతో ఆశ వర్కర్ ఆత్మహత్య

పెద్దవూర : అప్పుల బాధతో ఆశ వర్కర్ ఆత్మహత్య చేసుకుంది. పెద్దవూర మండలంలోని గర్నెకుంట గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గర్నెకుంటకు చెందిన బొంగరాల రజిత(36) అదే గ్రామంలో ఆశ వర్కర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తుంది. ఈమె భర్త గతంలోనే మృతిచెందాడు. కటుంబ పోషణ, పిల్లల చదువుల కోసం తెలిసిన వారి వద్ద రజిత రూ. ఐదు లక్షల అప్పు చేసింది. తీసుకున్న రుణం తిరిగి చెల్లించాలనే రుణదాతలు తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. అప్పు తీర్చే స్థోమత లేక మనస్తాపంతో సోమవారం సాయంత్రం తన ఇంట్లో రజిత గడ్డిమందు తాగింది. చుట్టుప్రక్కల వారు గమనించి ఆమెను 108 వాహనంలో మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. తండ్రి వీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు.


రజిత (ఫైల్)

గ్యాస్ లీకై చెలరేగిన మంటలు

- ఇంట్లోని ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ వస్తువులు దగ్ధం
- రూ.లక్షల్లో ఆస్తినష్టం

దేవరకొండ: గ్యాస్ లీకై మంటలు చెలరేగడంతో లక్షల్లోనష్టం వాటిల్లింది. ఈ ఘటన మంగళవారం దేవరకొండ పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని అయ్యప్ప నగర్‌లో నివాసం ఉంటున్న కేతావత్ నిమ్మలాల్ రోజు వారీగా విధులకు హాజరయ్యేందుకు మంగళవారం సైతం సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో ఇంట్లో గల కుంటుంబ సభ్యులు వంటకు ఉపక్రమించారు. దీంతో ఒక్కసారిగా గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. గమనించిన నిమ్మలాల్, జ్యోతి దంపతులు భయాందోళనకు గురై తమ పిల్లలను తీసుకొని బయటకు పరుగులు తీశారు. ఒక్కసారిగా చెలరేగిన మంటలతో ఇంట్లో గల ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో దాదాపు రూ.20లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలు అదుపు చేశారు.అప్పటికే ఇంట్లోని సామాగ్రి,కప్‌బోర్డ్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు అగ్నికి ఆహుతైనట్లు తెలిపారు.


దేవరకొండలో దగ్ధమైన ఇల్లు

అలరిస్తున్న పద్య, సాంఘిక నాటకోత్సవాలు



విశ్వామిత్ర విజయం పద్య నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

మిర్యాలగూడ: తెలంగాణ రాష్ట్ర భాషా సంస్కృతిక శాఖ, మిర్యాలగూడ సంస్కృతిక కళా కేంద్రం సంయుక్తంగా స్థానిక మినీ రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి పద్య, సాంఘిక నందిని నాటకోత్సవాలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. మంగళవారం నాలుగవ రోజు మిర్యాలగూడ సీనియర్ రిటైర్డ్ ఉపాధ్యాయులు వారణాసి ఆంజనేయశర్మ, ఖమ్మం జిల్లా సీనియర్ రంగస్థలం నటులు రంగాచార్యులు, సీనియర్ మేకప్ ఆర్టిస్ట్ అడవి శంకర్‌లు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి వెలిగించి నాటకోత్సవాలను ప్రారంభించారు. ఈ నాటకోత్సవాల ప్రారంభానికి ముందు మిర్యాలగూడకు చెందిన ప్రముఖ ఆర్టిస్ట్, సాహితీవేత్త, దాసి చిత్రానికి జాతీయ స్థాయిలో అవార్డు పొందిన పిట్టంపల్లి సుదర్శన్ మృతికి సంతాపం ప్రకటించారు. ఖమ్మం కల్చరల్ అసోసియేషన్ వారిచే ప్రదర్శించబడిన విశ్వామిత్ర విజయం, కర్నూలుకు చెందిన లలిత కళా సమితి టీజీ కళా క్షేత్రం వారు శ్రీకృష్ణ కర్ణార్జునీయం అనే పద్య నాటకాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అనంతరం కమిటీ సభ్యులు కళాకారులకు ప్రశంసాపత్రాలతోపాటు నగదు అందచేసి అభినందించారు. పట్టణ, పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రేక్షకులు హాజరై నందిని నాటకోత్సవాలను వీక్షించారు. కార్యక్రమంలో మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు తడకమళ్ల రామచంద్రరావు, అధ్యక్ష, కార్యదర్శులు భుజంగరావు, పులి కృష్ణమూర్తిశర్మ, గ్యార సాయిలు, పుల్లాభట్ల లక్ష్మీనారాయణశర్మ, చంద్రశేఖర్‌రావు, జానకిశర్మ, ఇనాయతుల్ల, శ్రీనివాస్‌శర్మ, పరిమి రామావతారం, ఉపేందర్ పాల్గొన్నారు.

చెరువు మట్టి తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత

హుజూర్‌నగర్ : అనుమతులు లేకుండా చెరువు మట్టి తరలిస్తున్న ఏడు టిప్పర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణంలోని శ్రీనివాసపురం శివారులోని చిన్న చెరువు నుంచి మంగళవారం తెల్లవారుజామున కొంత మంది వ్యక్తులు అనుమతి లేకుండా టిప్పర్ల ద్వారా మట్టిని ఇటుక బటీలకు రవాణా చేస్తున్నారు. అందిన సమాచారం మేరకు ఎస్ఐ సిబ్బందితో కలిసి లింగగిరి వెళ్లి ఏడు టిప్పర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. టిప్పర్ డైవర్లు, యజమానులు, ఇటుక బట్టీ యజమానులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.


హుజూర్‌నగర్: పోలీసులకు పట్టుబడ్డ టిప్పర్లు

ఎక్సైజ్ దాడుల్లో సారా, బెల్లం స్వాధీనం


పట్టుబడిన బెల్లంతో ఎక్సైజ్ అధికారి లక్ష్మానాయక్, సీఐ, ఎస్ఐలు

హుజూర్‌నగర్ : ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్, నల్లగొండ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఇటీవల దాడులు నిర్వహించి 23 లీటర్ల సారాతో పాటు 300 కిలోల బెల్లం స్వాధీనం చేసుకుని, 900 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేశారు. నలుగురిని అరెస్ట్ చేయగా మరో ఇద్దరు పారిపోయారు. మంగళవారం హుజూర్ నగర్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ లక్ష్మానాయక్ వివరాలు వెల్లడించారు. నల్లగొండ ఎన్‌ఫోర్స్‌మెంట్, హుజూర్‌నగర్, కోదాడ ఎక్సైజ్ అధికారులు మఠంపల్లి, చింతలపాలెం, మేళ్లచెరువు మండలాల్లోని పలు గ్రామాల్లో దాడులు నిర్వహించారు. చింతలపాలెం మండలం ఎర్రకుంట తండాకు చెందిన బానోతు శ్రీను వద్ద నుంచి 5లీటర్లు, బాణోత్ హనుమ వద్ద 3 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని వారిని అరెస్ట్ చేశారు. చింతలపాలెంలో ఓ ఇంట్లో దాచిన 300 కిలోల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. ఇదే గ్రామానికి చెందిన చిత్తలూరి లక్ష్మి సారా విక్రయిస్తుండగా ఆమె వద్ద నుంచి 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఆమెపై కేసు నమోదు చేశారు. ఆదే విధంగా మఠంపల్లి మండలంలో అవిరేణి కుంట తండా, సుల్తానాపూర్ తండా, రామచంద్రపురం తండా శివార్లలో దాచి ఉంచిన సుమారు 900 లీటర్ల బెల్లం పానకంను ధ్వంసం చేశారు. ఈ మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐలు రాకేష్, మల్లయ్య, శంకర్ లతోపాటు ఎక్సైజ్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పది లీటర్ల సారా స్వాధీనం

మఠంపల్లి మండలంలో వాహన తనఖీలు నిర్వహిస్తుండగా కాల్వపల్లి తండాకు చెందిన బానోతు కోట, బాణోత్ సోముడు బైక్‌పై సారా తరలిస్తుండగా చౌటపల్లి వద్ద పట్టున్నారు. వారి వద్ద నుంచి 10 లీటర్ల సారా, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు కోటను అదుపులోకి తీసుకోగా సోముడు పరారయ్యాడు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఘనంగా అశ్వవాహన సేవ

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని మైహోం సిమెంట్ పరిశ్రమలో గల శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా అహోబిల రామానుజజీయర్ స్వామి పర్యవేక్షణలో మంగళవారం ఐదవ రోజు ప్రణయకలహ ఉత్సవం, అశ్వవాహన సేవ, దోపోత్సవం నిర్వహించారు.కార్యక్రమంలో మైహోం సిమెంట్ పరిశ్రమ చైర్మన్ జూపల్లి రామేశ్వరరావు, శ్రీకుమారి దంపతులు, మునగాల రాంమ్మోహన్‌రావు, అరుణ దంపతులు, యూనిట్ హెడ్ శ్రీనివాసరావు, పరిశ్రమ ఉద్యోగులు పాల్గొన్నారు.


అశ్వవాహన సేవలో అర్చకులు

విద్యుత్ తీగలు తగిలి వరిగడ్డి ట్రాక్టర్ దగ్ధం

మేళ్లచెరువు : విద్యుత్ తీగలు తగిలి వరిగడ్డి ట్రాక్టర్ దగ్ధమైంది. ఈ ఘటన మంగళవారం మేళ్లచెరువు మండలంలోని రేవూరు గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లి మండలం గానుబండ గ్రామానికి చెందిన ట్రాక్టర్ వరిగడ్డి లోడ్‌తో వచ్చి రేవూరు గ్రామంలో విక్రయించేందుకు డ్రైవర్ వచ్చాడు. గ్రామానికి చెందిన పంగా సైదులు ఇంటివద్ద గడ్డి దింపేందుకు వెళ్తున్న క్రమంలో ప్రమాదవ శాత్తు విద్యుత్ తీగలు తగిలి మంటలు వ్యాపించాయి. దీంతో ట్రాక్టర్‌ను గ్రామం వెలుపలికి తీసుకొచ్చి గడ్డిని తీసే సమయంలో మంటలు టైర్లకు, ఇంజన్‌కు వ్యాపించడంతో ట్రాక్టర్ పూర్తిగా కాలిపోయింది. ప్రమాదంలో సుమారు పది లక్షల రూపాయల మేర నష్టం వాటినట్లు బాధితులు పేర్కొన్నారు.

మద్యం విక్రయిస్తున్న మహిళపై కేసు

రామగిరి(నల్లగొండ): అనుమతులు లేకుండా బెల్టు షాపులో మద్యం విక్రయిస్తున్న మహిళపై మంగళవారం తిప్పర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని మల్లేపల్లివారిగూడేనికి చెందిన బాగెరబోయిన భాగ్యమ్మ బెల్టు షాపులో మద్యం అమ్ముతుండగా ఎస్ఐ రాజు పట్టుకున్నారు. షాపులోని 21 బీర్లను స్వాధీనం చేసుకుని భాగ్యమ్మపై కేసు నమోదు చేశారు.

పంటకోత ప్రయోగాలతో దిగుబడి అంచనా

- నల్లగొండ సీపీఓ నిరంజన్‌రావు

నార్కట్‌పల్లి: ప్రతి ఏడాది వానాకాలం, యాసంగి సీజన్లో రాష్ట్ర ఆర్థికగణాంక శాఖ ఆధ్వర్యంలో పంటకోత ప్రయోగాల ద్వారా దిగుబడి అంచనా వేస్తున్నట్లు నల్లగొండ జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి నిరంజన్‌రావు తెలిపారు. మంగళవారం నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోలు గ్రామంలోని రైతులు ముజాహిద్ , సామ శంకర్‌రెడ్డి పొలంలో వరి పంట కోత ప్రయోగంలో భాగంగా ఎంపిక చేసిన పొలంలో 5 మీటర్ల పొడవు 5 మీటర్ల వెడల్పులో వరి పంటను కోసి , నూర్పిడి చేశారు. అనంతరం కొలత వేసి మొత్తం ఎకరానికి ఎంత దిగుబడి వస్తుందో అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికను అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత కాలంలో వరి పంట దిగుబడి అంచనా తెలుస్తుందని సీపీఓ వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ స్టాటిస్టికల్ అధికారులు విజయ్‌కుమార్, జయమ్మ, మండల గణాంక అధికారి మల్లికార్జున్, ఏఈఓ శిరీష, తదితరులు ఉన్నారు.


ధాన్యాన్ని తూకం వేస్తున్న అధికారులు

ఐదుగురు జూదరుల అరెస్ట్

భూదాన్‌పోచంపల్లి : పేకాట ఆడుతున్న ఐదుగురిని మంగళవారం ఎస్‌ఓటీ పోలీసులు అరెస్ట్ చేశారు. భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పురంలోని బాలాజీ వెంచర్‌లో ఓ రియల్ ఎస్టేట్ ఆఫీసులో పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొన్నారు. వీరి వద్ద నుంచి రూ.10,930 నగదుతో పాటు ఐదు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి

- నల్లగొండ ఎస్పీ చందనాదీప్తి

నల్లగొండ క్రైం : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి సూచించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో రాష్ట్ర యాంటి నార్కోటిక్ బ్యూరో విడుదల చేసిన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. నిషేధిత మత్తు పదార్థాల వాడకం సమాజానికి పట్టిన చీడ పురుగు వంటిదని, డ్రగ్స్ వినియోగాన్ని సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. యువత మత్తుకు బానిసగా మారి భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటోందన్నారు. డ్రగ్స్ వాడకం వల్ల రోడ్డు ప్రమాదాలు, ఇతర నేరాలకు పాల్పడి కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయన్నారు. మత్తు వల్ల కలిగే నష్టాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు, తమ పిల్లల జీవితం క్రమశిక్షణతో ఉండేలా పర్యవేక్షించాలని సూచించారు. ఎవరైన గంజాయి, డ్రగ్స్ సరఫరా చేస్తే టోల్‌ఫ్రీ నంబర్ (8712671111)కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములునాయక్, డీఎస్పీలు రమేష్, శివరాంరెడ్డి, సైదా, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల వాహనాల తనిఖీల్లో నగదు పట్టివేత

చిట్యాల: ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును వాహనాల తనిఖీల్లో పోలీసులు పట్టుకున్నారు. చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన వాహనాల చెక్‌పోస్ట్ వద్ద ఎస్ఎస్‌టీ, చిట్యాల పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.2.39లక్షల నగదును సీజ్ చేసినట్లు ఎస్ఐ డి.సైదాబాబు తెలిపారు. ఆ నగదును కలెక్టరేట్ అధికారులకు అందజేసినట్లు పేర్కొన్నారు.

కమ్మగూడెం వద్ద రూ.5.4లక్షలు

వలిగొండ : మండలంలోని నాగారం మధిర కమ్మగూడెం వద్ద మంగళవారం స్థానిక పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో రామన్నపేట మండలంలోని తుమ్మలగూడేనికి చెందిన గరుదాసు శివకుమార్ బైక్‌పై ఎలాంటి ఆధారాలు లేని రూ.5.4లక్షలను పోలీసులు పట్టుకున్నారు. ఆ నగదును భువనగిరిలో ట్రెజరీలో జమ చేయనున్నట్లు ఎస్ఐ మహేందర్ లాల్ తెలిపారు.

రూ. 1.59 లక్షలు స్వాధీనం

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి వద్ద వాహనాల తనిఖీల్లో పోలీసులు నగదు స్వాధీనం చేసుకున్నారు. జనగామకు చెందిన మంగా శ్రీను బొలేరో వాహనంలో నల్లగొండ నుంచి మిర్యాలగూడకు వెళ్తుండగా అతడి వద్ద ఆధారాలు లేని రూ.79,500 స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం గోపాలపురానికి చెందిన ఎల్లబోయిన బుచ్చయ్య బొలేరో వాహనంలో నల్లగొండ నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్నాడు. అతడి వాహనం తనిఖీ చేయగా రూ. 80 వేలు నగదును పట్టుకున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా కలిగి ఉన్న నగదును ఎస్ఐ డి.రాజు ట్రెజరీకి అప్పగించారు.

రూ.1.50లక్షలు సీజ్

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల కేంద్రంలో మంగళవారం చేపట్టిన వాహన తనిఖీలలో రూ.1.50లక్షల నగదును సీజ్ చేసినట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు. జడ్చర్ల నుంచి మిర్యాలగూడకు వెళ్తున్న ఓ వ్యక్తి వద్ద తనిఖీలు చేయగా ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఈ మేరకు నగదును సీజ్ చేసినట్లు తెలిపారు.

మాల్ వెంకటేశ్వరనగర్‌లో రూ.4.84 లక్షలు..

చింతపల్లి : చింతపల్లి మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వరనగర్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. నలుగురు వ్యక్తుల నుంచి రూ.4,84,500 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నవీన్ కుమార్, చింతపల్లి ఎస్ఐ యాదయ్య తెలిపారు.


చిట్యాల: పట్టుకున్న నగదుతో పోలీసులు


కొండమల్లేపల్లి : నగదును సీజ్ చేస్తున్న పోలీసులు


నగదు స్వాధీనం చేసుకుంటున్న నాంపల్లి సీఐ

క్లుప్తంగా

ఎక్సైజ్ దాడులు.. 44మందిపై కేసు

నల్లగొండ క్రైం: అనుమతులు లేకుండా మద్యం విక్రయాలు జరుపుతున్న 44మందిపై కేసు నమోదు చేసి 19మందిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, సూపరింటెండెంట్ సంతోష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ, నకిరేకల్, చండూరు, నాంపల్లి, దేవరకొండ, మిర్యాలగూడ, హాలియా స్టేషన్ల పరిధిలో ఇటీవల నిర్వహించిన దాడుల్లో 150 లీటర్ల సారా, 3,800 లీటర్ల బెల్లం పానకం, 490 కేజీల బెల్లం, 20 కేజీల పటికను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మొత్తంగా రూ.6.90లక్షల విలువైన ముడి సరుకును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కారు బోల్తా.. నలుగురికి గాయాలు

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట) : కారు అదుపుతప్పి బోల్తా కొట్టడంతో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని నంద్యాలగూడెం స్టేజీ సమీపంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండకు చెందిన నలుగురు స్వామిజీలు సూర్యాపేట నుంచి కారులో స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో నంద్యాలగూడెం స్టేజీ సమీపంలో రోడ్డు ఎగుడుదిగుడుగా ఉండడంతో ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తాపడింది. ప్రమాదంలో కారులో ఉన్న నలుగురు స్వామిజీలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

బైక్ అదుపుతప్పి..

నాగారం : బైక్ అదుపుతప్పి కిందపడడంతో ఒకరికి గాయాలయ్యాయి. నాగారం మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామానికి చెందిన ఉయ్యాల యాకూబ్ బైక్‌పై అర్వపల్లి నుంచి నాగారం వైపు వస్తున్నాడు. నాగారంబంగ్లాలోని ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద రాగానే బైక్ అదుపుతప్పి సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొట్టాడు. ఈ ఘటనలో యాకూబ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు.

గుర్తుతెలియని మృతదేహం ఆచూకీ లభ్యం

- మృతుడు ఏలూరు జిల్లా వాసిగా గుర్తింపు

నకిరేకల్ : నకిరేకల్ శివారులో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయిన వ్యక్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా వాసిగా పోలీసులు గుర్తించారు. ఏలూరు జిల్లా కైకలూరి మండలం ఆటపాక గ్రామానికి చెందిన వాడరేవుల నాగరాజు(48) చేపల విక్రయాల వావనంపై కూలీగా పని చేస్తున్నాడు. నాగరాజు స్వగ్రామం నుంచి డీసీఎం వాహనంపై హైదరాబాద్‌లో లోడ్ దింపి తిరిగి వస్తున్నారు. మార్గమధ్యలో నకిరేకల్ శివారులో డీసీఎం డ్రైవర్ టీ కోసం ఆపాడు. ఈ క్రమంలో వెనుక కూర్చున్న నాగరాజు వాహనం దిగి రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. డీసీఎం డ్రైవర్ అతడిని గమనించకుండా వెళ్లిపోయాడు. కేసు నమోదు చేసుకుని మృతుడి ఆచూకీ తెలుసుకుని మృతదేహాన్ని వారి కుటుంబీలకు అప్పగించామని ఎస్ఐ గోపికృష్ణ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన చింతలపాలెం మండలంలో మంగళవారం వెలుగుచూసింది. ఎస్ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపాలెం మండలంలోని బుగ్గమాదారం శివారులోని బుగ్గవాగు కృష్ణానదిలో కలిసే చోట గుర్తుతెలియని మగ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. అతనికి సుమారు 55 నుండి 60 ఏళ్ల వయస్సు ఉంటుంది. అతని ఒంటిపై చొక్కా లేదు. పచ్చరంగు లుంగి, ఎర్ర డ్రాయర్ ధరించి ఉన్నాడు. చనిపోయి సుమారు వారం రోజులు అయి ఉంటుందని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.